క్లుప్తంగా

సేవ్ ఎన్విరాన్‌మెంట్‌పై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: సేవ్ ఎనర్జీ, సేవ్ ఎన్విరాన్‌మెంట్ ప్రతి ఒక్కరి బాధ్యత అని గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఆశ్రీఫ్యాన్ పేర్కొన్నారు. గాంధీ నగర్ స్కూల్లో సేవ్ ఎనర్జీ ,సేవ్ ఎన్విరాన్‌మెంట్‌పై విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ఆశ్రీఫ్యాన్ మాట్లాడుతూ విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాస రచన, పోటీలను నిర్వహించడం ద్వారా విద్యార్థులో నైపుణ్యాలను వెలికి తీసేందుకు వీలవుతుందన్నారు. పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న పీఎండీ సాహైల్ అలీఖాన్

కడప సెవెన్‌రోడ్స్: రక్తదానంపై అవగాహన పెంచుకుని యువకులు ముందుకు రావాలని సమాచార పౌర సంబంధాల శాఖ ఫొటో గ్రాఫర్ పీఎండీ సాహైల్‌అలీఖాన్ కోరారు. కడప జీజీహెచ్‌లో ఓ గర్భిణికి రక్తం అవసరం కావడంతో ఆయన 47వ సారి రక్తదానం చేశారు. సాహైల్ మాట్లాడుతూ సరైన సమయానికి రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు గమనించానన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంలో ముందుకు వచ్చి ప్రాణాలు నిలపాలని కోరారు.

5న జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సి.సుబ్రహ్మణ్యం

కడప అర్బన్: కడప బార్ అసోసియేషన్ హాల్‌లో ఈ నెల 5న జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను యువ న్యాయవాదులంతా సద్వినియోగం చేసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు సి.సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి విజయమారుతీ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బసవతారకం లా కాలేజీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష ఈ నెల 5న నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 16న జరగబోయే జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు హాజరయ్యే యువకులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మోడల్ పరీక్షకు హాజరయ్యేవారు 7013740055, 9963328876 ఫోన్ నెంబర్లలో పేరు నమోదు చేయించుకోవాలని వారు కోరారు.

విజిబుల్ పోలీసింగ్‌తో భద్రతకు భరోసా



కడప రైల్వేస్టేషన్‌లో సీఐ ఎస్‌ఐ తనిఖీలు

కడప అర్బన్: విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఎస్పీ ఈజీఅశోక్ కుమార్ ఆదేశించడంతో పోలీసు అధికారులు గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికుల ఆటోల్లో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు. కడప చిన్నచౌక్ పరిధిలో ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, వన్‌టౌన్ పరిధిలో సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, టూటౌన్ పరిధిలో ఎస్‌ఐ ఎస్‌కెఎం.హుసేన్ తనిఖీల్లో పాల్గొన్నారు.

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

సిద్దవటం : ఖరీఫ్‌లో రైతులు సాగుచేసుకొని పంటలకు పచ్చిరొట్ట ఎరువు విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి వాటిని రైతులకు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి, మాధవరం–2 రైతు సేవా కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. మాట్లాడుతూ రైతులు 50 శాతం సబ్సిడీతో వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు పొందవచ్చునన్నారు. అవసరమున్న వారు వ్యవసాయ అధికారుల కార్యాలయాలను సంప్రదించాలన్నారు. వేసవిలో నీటి ఆధారం ఉన్నచోట తప్పనిసరిగా పెసర, మినుములు వంటి వేసవి పంటలను సాగుచేసుకొని ఆదాయంతో పాటు భూసారాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు.

వర్షించిన మేఘం.. పులకించిన జనం



రహదారులపై నిలిచిన నీటిలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



హెచ్‌జీపీఎస్ స్ట్రీట్‌లో బురద నీటిలో వ్యాపారుల అవస్థ



మద్రాస్ రోడ్డులో వర్షంలో తడుస్తూ వెళ్తున్న పాదచారులు

బంగాళాఖాతం అల్పపీడనంతో అకాల వర్షం కురిసింది. కడప నగరంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో అల్లాడిపోయారు. గురువారం సాయంత్రం ఉన్నట్లుండి ఆకాశమంతా మేఘావృతమై చల్లటి గాలులు.. చిరుజల్లులతో సుమారు 40 నిముషాలపాటు వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది. వేసవి ఎండలతో అప్పటివరకూ అల్లాడుతున్న జనానికి వర్షం రాక ఉపశమనం కలిగించింది. నగరంలోని రోడ్లన్నీ జలమయంగా మారాయి. చల్లటి గాలులు వీయడంతో పులకరించిపోయారు. అక్కడక్కడా పిల్లలు వర్షపు నీటిలో కేరింతలు కొట్టారు. ఏది ఏమైనా ఈ వర్షం నగరవాసులకు ఎండల తీవ్రత నుంచి ఒక్కపూట ఉపశమనాన్ని కలిగించింది. వర్షం వల్ల కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగి, లైన్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కడప ఆర్టీసీ బస్టాండులో వర్షపు నీరు ప్లాట్ ఫామ్‌లను తాకింది. తమ గమ్యస్థానాలకు చేరుకునే క్రమంలో బస్టాండులోకి వెళ్లేందుకు ప్రయాణీకులు నానా పాట్లు పడ్డారు. మహిళలు, చిన్నారులు, అతి కష్టంపై చేరుకోవాల్సి వచ్చింది.

– కడప కార్పొరేషన్, రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్



హెచ్‌జీపీఎస్ స్ట్రీట్‌లో వర్షంలో చిన్నారులు కేరింత









విస్తారంగా వర్షం కురవడంతో నగరంలోని మద్రాస్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో వర్షంలో తడుస్తూ ద్విచక్రవాహనాల్లో జనం అవస్థలు



నిలిచిన నీటిలోనే ఆటో డ్రైవర్ల అవస్థలు

వర్షాలకు తడవకుండా మహిళల అవస్థ

పురస్కారాలతో జిల్లా కీర్తి నిలిపారు

కడప కల్చరల్: ఉగాది పురస్కారాలు పొందిన రచయితలు కడప కీర్తిని నిలిపారని యోగి వేమన విశ్వవిద్యాలయం కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ అన్నారు. స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉగాది పురస్కార గ్రహీతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుత్తా పద్మ మాట్లాడుతూ జింకా సుబ్రహ్మణ్యం, గానుగపెంట హనుమంతరావు నిత్యం సాహితీ కార్యక్రమాలతో తలమునకలుగా ఉంటారని, శివారెడ్డి నిరంతరం రచనలు చేస్తూ గడుపుతుండడం విశేషమన్నారు. విశిష్ఠ అతిథి, మైనార్టీ సంక్షేమశాఖ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ జిల్లాకు చెందిన ముగ్గురు రచయితలకు ఉగాది పురస్కారాలు లభించడం సంతోషం అన్నారు. మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన యువ రచయితలకు ఈ పురస్కారాలు స్ఫూర్తినివ్వగలవన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, భూతపురి గోపాల కృష్ణశాస్త్రి, డాక్టర్ పొదిలి నాగరాజు, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, హరిభూషణ రావు, రామ్మోహన్‌రెడ్డి, ముడియం కిశోర్, రామాంజనేయులు, మధు, భారవి తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు పొందిన కవులతో నిర్వాహకులు

ఉపాధి హామీ పనుల తనిఖీ

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీలోని చాముండేశ్వరిపేట గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీఓ నరసింహులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్‌ను తనిఖీ చేపట్టగా 32 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లడుతూ ఉపాధి హామీ పనులలో భాగంగా కూలీలతో మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలని, నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేస్తే ప్రతి కూలీకి రూ. 3 వందలు వస్తుందన్నారు. వడదెబ్బ తగలకుండా మంచినీరు, కొబ్బరి బోండాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని సూచించామన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ఉద్యోగుల న్యాయ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ యునైటీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెండవ రోజున గురువారం యూనియన్ నాయకులు, ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ కచ్చితంగా అమలుచేయాలని, నైట్ అవుట్ అలవెన్స్ రూ.300 ఇవ్వాలని, హయ్యర్ పెన్షన్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. అలాగే ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వాలు లేదా సంస్థ కొనుగోలుతోపాటు ఎండీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్న సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాస్, శ్రీనివాసులు, జయరాం, రామచంద్ర, జయరాం నాయక్, చెన్నా రెడ్డి,చాంద్ బాషా, శ్రీదేవి, హరిప్రసాద్, సునంద, తదితరులు పాల్గొన్నారు.

నగర సమస్యలపై 7న చలో కార్పొరేషన్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 7న కడప నగర ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన చలో కార్పొరేషన్‌ను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం చలో కార్పొరేషన్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరాభివృద్ధి పేరుతో పెద్ద ఎత్తున నిధులు తీసుకువస్తామని పాలకులు చెప్పిన మాటలు సామాన్య ప్రజానీకానికి ఏ మాత్రం ఉపయోగపడే స్థితిలో లేవని విమర్శించారు. అభివృద్ధి కేవలం ప్రధాన రోడ్లకు మాత్రమే పరిమితమైందన్నారు. విలీన పంచాయితీల్లో అభివృద్ధి బూతద్దం పెట్టి వెతికినా కనపడలేదన్నారు. నగర శివారులోని ప్రాంతాల రోడ్లు, డ్రైనేజీ మంచి నీటి సరఫరా, వీధి దీపాలు, తదితర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగరంలోని మృత్యుంజయకుంట ప్రాంతం చాలా అధ్వానంగా ఉందని, దీని అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దీస్తగిరిరెడ్డి, కుమారస్వామిరెడ్డి, కామేశ్వరమ్మ, గోవిందు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం!



కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించి విద్యారంగాన్ని బలోపేతం చేద్దామని యూటీఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. కడప యూటీఎఫ్ భవన్ వద్ద ప్రచార కర పత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ ఆప్యాయత, ఎలాంటి పరిస్థితులునైనా ఎదుర్కొనే ధైర్యం, ఎదుటివారితో గౌరవంగా మెలగడం, సమాజంలో ఎలా జీవించాలో నేర్పించడం, నైతిక విలువలు ప్రభుత్వ బడి నేర్పిస్తుందని తెలిపారు. చదువు సరకుగా మారి లాభాలు అర్జించే సాధనమైందని వారు పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలు అమలు చేయడమే తమ ప్రధాన కర్తవ్యంగా ప్రభుత్వాలు ప్రణాళిక రూపొందిస్తున్నాయని, అందుకు అనుగుణంగా పాఠశాలల విలీనం, ఉపాధ్యాయుల సంఖ్య కుదింపు చేపడుతోందని ఆరోపించారు. జాతీయ విద్యా విధానంలో చేపడుతున్న మార్పులతో నేడు విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమవుతున్నదన్నారు. విద్యారంగంలో సంక్షోభం వచ్చినప్పుడల్లా ఆ సంక్షోభాన్ని నివారించడానికి బడిని కాపాడుకుందాం, విద్యా వికాస వేదిక, ఊరిబడి మన ఊరిలోనే, బడికోసం బస్సు యాత్ర వంటి కార్యక్రమాలతో యూటీయఫ్ ప్రజలతో కలిసి ఉద్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాతరాణి, కె.నరసింహారావు, సి.వి.రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, టి.శివ ప్రసాద్, ఎం.ప్రభాకర్, డి.రూతు ఆరోగ్య మేరీ, రాజశేఖర్ రాహుల్, సరస్వతి, గోపినాథ్, రామకేశవ, ప్రకాష్‌బాబు, దేవదత్తం, కె.సుధాకర్, ఎస్.దేవానందం, కె.ఈశ్వరయ్య, ఎస్.మస్తాన్ వలి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

11న చలో ఢిల్లీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : దేశంలో పెరిగిపోతున్న నిత్యావసర ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలనే డిమాండ్లపై ఈ నెల 11వ తేదీన ఢిల్లీలో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు సుబ్బమ్మ కోరారు. గురువారం కడప నగరంలోని ఓంశాంతి నగర్‌లోని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో చలో ఢిల్లీకి సంబంధించిన పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు, నిరుద్యోగులు, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాయలసీమ కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్, అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, మహిళలు కీర్తన, విజయ, ధనలక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు

ప్రైవేటు సేవ ముద్దు- ప్రజల సేవ వద్దు



నగర పాలక సంస్థ పారిశుద్ధ్య అధికారుల నిర్లక్ష్యంతో నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులలో వచ్చే బయో వేస్ట్‌ను మునిసిపల్ వాహనాల్లో తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బయో వేస్ట్‌ను ప్రత్యేక వాహనాల్లో నగర శివారుకు తీసుకెళ్లి వేడిలో కరిగించాలి. మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా చెత్త వాహనంలో తీసుకెళ్లి డంప్ చేస్తున్నారు. ఎర్రముక్కలపల్లి వద్ద కనిపించిన దృశ్యాలను సాక్షి చిత్రీకరించింది.

– సాక్షి ఫొటో గ్రాఫర్

నిర్వహణ మరిచారు.. బంకులు తెరిచారు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని రాజీవ్ మార్గ్(దొంగల చెరువుకట్ట)లో ఉద్యానవనం అధ్వానంగా మారింది. పార్కు ఎదుట వ్యాపారులు బంకులు, తోపుడుబండ్లు ఏర్పాటు చేసుకొని ఆక్రమించేశారు. మిగిలిన జాగాలో కంకర, చెత్త, చెదారం వేయడంతో పార్కుకు వచ్చే సందర్శకులు తమ వాహనాలను పార్కింగ్ చేసేందుకు, లోపలికి వెళ్లి వచ్చేందుకు అవకాశం లేకుండాపోతోంది.

దుకాణాల ఏర్పాటు ఏమైంది?

2023లో ఒక ఏడాది కాలానికి షాపులు ఏర్పాటు చేసుకొనేందుకు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం ఆ కాలపరిమితి పూర్తయింది. నగరపాలక అధికారులు పట్టించుకోవడంలేదు. పార్కు ఎదుట భాగంలో తోపుడు బండ్లు, బంకులు ఇతర వాహనాలు 20 వరకూ పార్కింగ్ చేసి ఉంచుతున్నారు. గత కమిషనర్ ఈ బండ్లను సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకే ఉంచాలని అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత వ్యాపారులు వాటిని తమ ఇళ్లకు తోసుకొని పోయేవారు. కానీ ఇటీవలి కాలంలో ఆ తోపుడు బండ్లను తీసుకెళ్లకుండా పగలు, రాత్రి ఇక్కడే ఉంచుతున్నారు. రెండు వెండింగ్ మెషీన్లు ఏర్పాటు చేశారు. వాటికి పార్కుకు సంబంధించిన విద్యుత్‌నే ఉపయోగించుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. వ్యాపారులు తమ షాపు వద్ద ఏర్పడిన చెత్త వారే కలెక్ట్ చేసి కార్పొరేషన్ వాహనాలకు అప్పగించాలి. చెత్తాచెదారం ఎట్టి పరిస్థితుల్లోనూ వేయకూడదు. కానీ అందుకు విరుద్ధంగా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్న పరిస్థితి ఉంది. అలాగే ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే నూనెలు, వ్యర్థాలను ఇక్కడే పడేయడంతో చెత్త ఎత్తి వేసినప్పటికీ ఆ నూనెల వల్ల ఫ్లోరింగ్‌పై నల్లటి జిగట ఏర్పడి వర్షాలు పడినప్పుడు జనం జారి పడే అవకాశాలున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు ఆదాయం పేరుతో సందర్శకులను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాజీవ్ గాంధీ విగ్రహం ఎదుట చెత్తాచెదారం

పార్కు ఎదుట ఉన్న మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీకి అవమానం జరుగుతోంది. ఆయన విగ్రహం వద్ద స్థానిక వ్యాపారులు చెత్త చెదారం వేస్తున్నారు. ఎవరి వద్ద ఏర్పడిన చెత్త వారే ఎత్తాలని నిబంధన ఉన్నా ఎవరికి వారు చెత్త ఎత్తకుండా ఇదిగో ఇక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఎదుట వేస్తున్నారు. నగరపాలక సిబ్బంది కొన్ని సార్లు ఎత్తేస్తున్నా వ్యాపారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. పదే పదే ఇలా వేయడంతో నగరపాలక సిబ్బంది ఎత్తడం మానేసినట్లు తెలుస్తోంది. విగ్రహం ముందు చెత్త నిల్వలతో నిండింది.



రాజీవ్ పార్కు ఎదుట పర్మినెంట్‌గా ఉంచిన తోపుడు బండ్లు, బంకులు



రాజీవ్ పార్కు ఎదుట ఉన్న కంకర



రాజీవ్ గాంధీ విగ్రహం ఎదుట చెత్తాచెదారం

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

– ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి



మాట్లాడుతున్న ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పేర్కొన్నారు. కడప నగర శివారు లోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దని, బాగా చదువుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. చిన్న పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, కూలీలు మత్తుకు అలవాటుపడడంతో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యే పరిస్థితులు కలుగుతున్నాయన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడంతో మైండ్‌తోపాటు, విచక్షణా శక్తి కోల్పోతున్నారన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా యువత కీలకమని, ఎవరూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.వి.ఎస్.ఎస్.మూర్తి, ఎన్ఎస్ఎస్ పీఓ లక్ష్మయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.